విద్యుత్‌కే మొదటి ప్రాధాన్యత

- రాష్ట్రంలో గణనీయమైన ప్రగతి సాధించాం
- విద్యుత్ ప్రగతి సభలో ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి


విద్యుత్ పొదుపుపై ప్రతిజ్ఞచేయిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్: నిత్య జీవితంలో విద్యుత్‌కే మొదటి ప్రాధాన్యత దక్కుతుందని అలాంటి రంగంలో దేశంలోనే నెం.1 రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని జడ్చర్ల ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని చంద్రాగార్డెన్‌లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన నియోజకవర్గ విద్యుత్ ప్రగతి సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సీఎం కేసీఆర్ విద్యుత్ ప్రాముఖ్యతను గుర్తించి అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. తెలంగాణ తొలి విద్యుత్‌శాఖ మంత్రిగా సంస్కరణల్లో భాగస్వామినైనందుకు గర్వంగా ఉందన్నారు. రాష్ట్రంలో విద్యుత్‌రంగంలో గణనీయమైన ప్రగతి సాధించామన్నారు. ఈ రంగంలో ప్రగతి సాధించిన కారణంగా రాష్ట్రంలో అనేక పరిశ్రమలు వస్తున్నాయని, పెట్టుబడులు వచ్చాయన్నారు. ఎవరైనా పెట్టుబడి పెట్టాలనుకుంటే ప్రధానంగా విద్యుత్, నీళ్లు, మౌలిక సదుపాయాలతోపాటు సుస్థిర ప్రభుత్వం ఉందా లేదా అని ఆలోచిస్తారన్నారు. పై మూడింటిలోనూ రాష్ట్రం నెం.1గా ఉండటం వల్ల పెట్టుబడులు దారాళంగా వస్తున్నాయన్నారు. కరెంట్ కోతలతో, లోఓల్టేజీతో సతమతమయ్యే పరిస్థితులు నాడు అనుభవించామని, ట్రాన్స్‌ఫార్మర్ ఇస్తే చాలు ఓట్లేస్తామనే స్థితి ఉండేదన్నారు. ఎంతోమంది రైతులు తమ ఊరికి ట్రాన్స్‌ఫార్మర్ ఇస్తే ఓట్లేస్తామని అప్పట్లో చెప్పేవారన్నారు. ఇప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లు అడిగిన వెంటనే ఇవ్వటమే కాకుండా సబ్‌స్టేషన్లను మంజూరు చేస్తూ పూర్తిచేయిస్తున్నామన్నారు. 24 గంటల కరెంట్ కలా నెరవేరిందన్నారు. నాడు మిడ్జిల్ మండలంలోని కేఎల్‌ఐ కాల్వపై రైతులు ఒకటి రెండు మోటర్లు పెడితే క్రిమినల్‌కేసులు పెట్టేవారని, నేడు వేలాది మోటర్లు పెట్టుకుంటున్నా మద్దతుగా నిలుస్తున్నామన్నారు. చిన్న చిన్న సమస్యల వల్ల ఎక్కడైనా లోపం ఉండవచ్చని వాటిని సరిదిద్దుతామన్నారు. విద్యుత్ ఉద్యోగులు–సిబ్బంది ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. విద్యుత్ డీఈ కృష్ణమూర్తి రాష్ట్రం విద్యుత్ రంగంలో ఎంతో ప్రగతి సాధించిందని, అయితే తమపై అదే స్థాయిలో భారం పెరిగిందన్నారు. అయినప్పటికీ సంతృప్తికరంగా జీతాలు వస్తున్నందున కష్టమైనా ఇష్టంతో చేస్తున్నామన్నారు. అనంతరం సమావేశంలో విద్యుత్ పొదుపు చేస్తామని ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి సభికులతో ప్రతిజ్ఞ చేయించారు. జెడ్పీసీఈఓ జ్యోతి, జెడ్పీవైస్‌చైర్మన్ యాదయ్య, డీసీఎంఎస్‌చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి, ఏడీలు శ్రీనివాస్, థావుర్యానాయక్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు. విద్యుత్ ఉద్యోగులు ఆటపాటలతో సభలో పాల్గొనగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సైతం వారితో కలసి నృత్యం చేశారు. అంతకుముందు జ్యోతి వెలిగించి సభను ప్రారంభించారు.

కాంప్లెక్స్ నిర్మించేవరకు పోరాటం


దీక్షలో పాల్గొన్న బాధితులు

దేవరకద్ర: మండల కేంద్రంలోని రాయచూర్ రోడ్‌లో సగంలో నిలిచి పోయిన వీరప్పయ్య దేవస్థానం కాంపెక్స్ షాపుల నిర్మాణం పనులు చేపట్టాలని, అప్పటి వరకు పోరాటం చేస్తామని బాధితులు అన్నారు. ఈ మేరకు బాధితులు చేపట్టిన దీక్షలు సోమవారం 9వ రోజుకు చేరాయి. నాలుగేళ్ల క్రితం ఎండో మెంట్ జారీ చేసిన జీవో ప్రకారం 54 మంది లబ్ధిదారులు షాపులు నిర్మాణం కోసం పెట్టుబడిగా ఒక్కొక్కరు రూ. 4 లక్షలు చెల్లించామని అయినా ఇప్పటికీ పూర్తిచేయడం లేదని వారు వాపోయారు. ఎండోమెంట్ అధికారులు స్పందించి సమస్యను తక్షణం పరిష్కరించాలని కోరారు.

బడిబాట కరపత్రం విడుదల


కరపత్రాలతో కలెక్టర్ రవినాయక్ తదితరులు

నవాబుపేట: మన ఊరు మన బడి పేరుతో గ్రామాల్లో ప్రైవేట్‌కు దీటుగా మారిన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేలా ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని కలెక్టర్ రవినాయక్ సూచించారు. పర్వతాపూర్ మైసమ్మ ఆలయ ఆవరణలో బడిబాట కరపత్రాన్ని మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయుల సమక్షంలో కలెక్టర్ ఆవిష్కరించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి రాజునాయక్, ఉపాధ్యాయులు నర్సింహులు, రాములు, బాల్‌రాజ్, రవి, సదాశివుడు, జనార్దన్ తదితరులు ఉన్నారు.

చెరువు కట్టలపై మొక్కలను తొలగించాలి


చెరువుకట్టను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కోయిల్‌కొండ: మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న చెరువు కట్టలపై పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని ఎంపీడీఓ జయరాములు సూచించారు. మండలంలోని అనంతపూర్, కేశ్వాపూర్ గ్రామాల్లో ఉన్న చెరువు కట్టలపై ఉపాధిహామీ ద్వారా పిచ్చి మొక్కలను తొలగిస్తున్న పనులను ఆయన సోమవారం పరిశీలించారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 8న గ్రామాల్లో కట్టలపై చెరువును పండుగను నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

అర్హులకే 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జడ్చర్ల టౌన్: అర్హులకే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని బీజేపీ నాయకులు అన్నారు. ఈ మేరకు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. మున్సిపాలిటి పరిధిలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూం పంపిణీలో అవకతవకలు జరిగితే తాము ఆందోళనలు చేపడతామని నాయబ్ తహశీల్దార్ వెంకటేశ్వరి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. కౌన్సిలర్ కుమ్మరి రాజు, పట్టణ అధ్యక్షుడు సామల నాగరాజు, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, మధుగౌడ్, అనంతకిషన్ పాల్గొన్నారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో నెల కొన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. స్థానిక ఐదో వార్డు పరిధిలోని పోచమ్మకాలనీ, సగరకాలనీ, రామకృష్ణ కాలనీ, వాసవీకాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీల్లో సోమవారం పర్యటించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా మంత్రి మొక్క నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థతో పాటు సీసీరోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేసి పనులు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పాలకొండ పెద్ద చెరువు ఆక్రమణకు గురికాకుండా ఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. కాగా, హౌసింగ్ బోర్డు కాలనీలో ఓ వ్యక్తి ఏకంగా రోడ్డును ఆక్రమించి ఇల్లు నిర్మిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన వెంటనే బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని డ్రెయినేజీపై కల్వర్టు నిర్మించి స్థానికుల రాకపోకలకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్‌చైర్మన్ కె.వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కౌన్సిలర్ కె.వనజ, మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, ఏఈ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు



మహబూబ్‌నగర్ క్రీడలు: ఆర్‌కే స్పోర్ట్స్ కరాటే మార్షల్ ఆర్ట్స్ ఫౌండర్ కె.రవికుమార్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ ఆవరణలో నెల రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. ఈసందర్భంగా విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న స్కూల్ కరస్పాండెంట్ రాజేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శాంత విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ ఇన్‌స్ట్రక్టర్లు నిఖిల్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్ల స్థలాన్ని తగ్గించవద్దు


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న దోకూర్ గ్రామస్తులు

దేవరకద్ర: డోకూర్ గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్లాట్ల స్థలాలను తగ్గించరాదని మొరపెట్టుకున్నారు. ఇరవై అయిదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం పేదలకు ఒక్కొక్కరికి 150 గజాల చొప్పున కేటాయించి పట్టాలను జారీ చేసిందన్నారు. కాగా ఇప్పటి వరకు ప్లాట్లలో నిర్మాణం చేపట్టక పోవడంతో రెవెన్యూ అధికారులు కొత్తగా లేఅవుట్ రూపొందించి స్థలాల విస్తీర్ణం కుదించారని అన్నారు. కేవలం 75 గజాలు కేటాయిస్తామని తహసీల్దార్ జ్యోతి తెలపడంతో అబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ స్థలాలు యథావిధిగా ఉంచాలని తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కాగా గ్రామానికి చెందిన మరో వర్గం వారు లబ్ధిదారులతో వాగ్వివాదానికి దిగారు. ఎస్‌ఐ వెంకటేష్ అక్కడికి చేరుకుని ఇరువర్గాలను సముదాయించారు. ఇంటి నిర్మాణాలు చేపట్టక పోవడం వల్ల తిరిగి స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చని తహసీల్దార్ ఈ సందర్భంగా తెలిపారు. కొత్త లేఅవుట్ ప్రకారం స్థలాలు కేటాయిస్తామని ఆమె చెప్పడంతో ఇరువర్గాల వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

మండల ఏర్పాటుపై నిర్లక్ష్యం తగదు



కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం తగదని సాధన సమితి కన్వీనర్ రాముునాయక్, కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం 136వ రోజు నిర్వహించిన రిలేదీక్షలో వారు పాల్గొని మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి చొరవ తీసుకొని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి గార్లపహాడ్‌ను మండలంగా ఏర్పాటు చేయాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న న్యాయమూర్తి తదితరులు


జిల్లాకేంద్రంలో మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ అధికారులు



క్లాక్‌టవర్ వద్ద ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు, సిబ్బంది

పాలమూరు: భావితరాల భవిష్యత్ కోసం ప్లాస్టిక్ నివారణ అత్యవసరమని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి కుటుంబం చిత్తశుద్ధితో మెలగాలని జిల్లా కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తిబోయ శ్రీనివాసులు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కోర్టు నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఆతర్వాత కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి ప్లాస్టిక్‌తో ప్రమాదం ఉందన్నారు. ప్లాస్టిక్ బదులు జ్యూట్ బ్యాగులు లేదా పేపర్ బ్యాగ్‌లను వాడాలన్నారు. న్యాయమూర్తులు శ్రీదేవి, చంద్రకళ, వై.పద్మ, పద్మావతి, చిరంజీ ఆశలత, శ్రీదేవి, హరికుమార్, నిహారిక, మనోహర్, పీపీ బెక్కెం జనార్దన్, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ న్యాయవాదులు పాల్గొన్నారు.

⇨ అదేవిధంగా భారత ప్రభుత్వ యువజన సరీ్వస్, క్రీడల శాఖ(నెహ్రూ యువ కేంద్రం), నవోదయ ఫిజియోథెరపీ, నర్సింగ్ కళాశాలల ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. జిల్లా నెహ్రూ యువకేంద్ర యువజన అధికారి కోటానాయక్, కళాశాల ప్రిన్సిపాల్ నవీన్‌చంద్, పర్యావరణ వేత్త పి.బాలలింగయ్య పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మండలంలోని అప్పాయిపల్లి జేపీఎన్‌సీ కళాశాల విద్యార్థులు మొక్కలు నాటారు. చైర్మన్ రవికుమార్, సర్పంచ్ ఊషన్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

⇨ పర్యావరణ పరిరక్షణలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎన్‌సీసీ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ జీబీఎంకే రావు పేర్కొన్నారు. మెట్టుగడ్డ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించి, మొక్కలు నాటారు. కుల్‌దీప్‌సింగ్, జర్నల్‌సింగ్, వీరేందర్‌సింగ్, విజయ్‌కుమార్, రామకృష్ణ, రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలో వృక్షశాస్త్ర అధ్యాపకుడు, బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త డా.సదాశివయ్య, ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సదాశివయ్యను సత్కరించారు. కౌన్సిలర్ సతీష్, సొసైటీ నిర్వాహకురాలు బాలమణి, సభ్యుడు రాధాకృష్ణ పాల్గొన్నారు.

గండేడ్: వెన్నాచేడ్‌లో సర్పంచ్ గంగుల పుల్లారెడ్డి గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. మాజీ సర్పంచ్ అనంత లక్ష్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఖలీం తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: వేస్టన్ ఆంధ్రా టోల్‌వేస్ ఆధ్వర్యంలో శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద మొక్కలు నాటారు. డిప్యూటీ తహసీల్దార్ నర్ర శ్రీనివాస్, టోల్‌ప్లాజా ప్రాజెక్టు హెడ్ దీప మాడియా, గిర్దావర్ ఇషాన్ మొక్కలు నాటి నీళ్లు పోశారు. అదేవిధంగా 44వ నంబర్ జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలకు ఉచితంగా పొల్యూషన్ టెస్ట్ చేసి సర్టిఫికెట్లను అందజేశారు. ఆపరేషన్స్ మేనేజర్ సంతోష్‌కుమార్, రూట్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ రాకేష్‌గౌడ్, ఎలక్ట్రికల్ ఇంజనీయర్ సుభాష్, ఎక్విప్‌మెంట్ ఇన్‌చార్జ్ కిరిటీ పాల్గొన్నారు.

దేవరకద్ర: గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఈవో సీత్యానాయక్ ఆధ్వర్యంలో పలువురు యువకులు, వార్డు సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. యుగంధర్‌రెడ్డి, రాము, సురేశ్, బుచ్చన్న, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ర్యాలీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పారిశుద్ధ్య కార్మికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ర్యాలీని ఇన్‌చార్జ్ ఏఎంసీ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అక్కడి నుంచి రాజీవ్‌సర్కిల్ మీదుగా క్లాక్‌టవర్, పాన్‌చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. అంతకుముందు క్లాక్‌టవర్ వద్ద ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఇన్‌స్పెక్టర్ వజ్రకుమార్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వాణికుమారీ తదితరులు పాల్గొన్నారు.


శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద మొక్క నాటుతున్న ప్రాజెక్టు హెడ్ దీప


దేవరకద్రలో..


చేతి సంచులను ప్రదర్శిస్తున్న సదాశివయ్య, సొసైటీ సభ్యులు

అభివృద్ధి పనులు చేపట్టాలి


మాట్లాడుతున్న చైర్మన్ కేసీ నర్సింహులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు సూచించారు. సోమవారం సాయంత్రం తన చాంబర్‌లో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మంజూరైన రూ.వంద కోట్లకు సంబంధించి గుర్తించిన పనులకు వెనువెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ నిధులకు త్వరలోనే ఆర్థిక శాఖ నుంచి అనుమతి వస్తుందన్నారు. ప్రతి వార్డులో ఇప్పటికే కౌన్సిలర్లు ప్రతిపాదించిన వాటికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ తాటి గణేష్‌కుమార్, కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, ఎంఈ సుబ్రమణ్యం, డీఈఈ బెంజిమన్, ఏఈ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డును బాగు చేయించండి


హైవే పక్కన బలీదుపల్లి స్టేజీ వద్ద అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్డు



రహదారిపై మూసి వేసిన రోడ్డు క్రాసింగ్

అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లి స్టేజీ వద్ద హైదరాబాద్ వైపు వెళ్లే 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డు అసంపూర్తిగా ఉంది. పెద్దమందడి మండలంలోని వెల్టూర్ స్టేజీ నుంచి బలీదుపల్లి స్టేజీ వరకు ఉన్న ఈ సర్వీస్ రోడ్డును అసంపూర్తిగా వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. బలీదుపల్లి, కన్మనూర్, వర్నె, ముత్యాలంపల్లి గ్రామస్తులకు సర్వీస్ రోడ్డు కష్టాలు తీరడం లేదు. ఆయా గ్రామాల నుంచి రహదారి వద్దకు వచ్చే వాహనదారులు కొత్తకోట వైపు వెళ్లడానికి వెల్టూర్ స్టేజీ వరకు హైవేపై రాంగ్‌రూట్లో వెళ్లాలి. గతంలో ఇక్కడ ఉన్న రోడ్డు క్రాసింగ్‌ను కొన్నేళ్ల కిందట రహదారి నిర్వాహకులు మూసి వేశారు. క్రాసింగ్‌ను మూసి వేసినప్పుడే సర్వీస్ రోడ్డును బాగు చేయిస్తే వాహనదారులకు ఇబ్బందులు ఉండేవి కావు. కానీ సర్వీస్ రోడ్డు గురించి పట్టించుకోకపోవడంతో రాత్రివేళ ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉంటోంది. రాంగ్‌రూట్లో వచ్చిన వాహనదారులు ఇక్కడ పలుమార్లు ప్రమాదాలకు గురైన సందర్భాలు లేకపోలేదు. సర్వీస్ రోడ్డును బాగు చేయించాలని రహదారి నిర్వాహకులకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ రోడ్డుపై నడిచి వెళ్లడానికి కూడా వీలు లేకుండా ఉంది. దీంతో ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డును బాగు చేయిస్తే రాంగ్‌రూట్ బాధలు తప్పుతాయని వాహదారులు పేర్కొంటున్నారు.

వీధికుక్క దాడిలో ఏడుగురికి గాయాలు

జడ్చర్ల టౌన్: మండలంలోని కోడ్గల్‌లో సోమవారం వీధి కుక్క బీభత్సం సృష్టించి రోడ్డుపై వెళ్తున్న వారందరినీ కరిచి గాయపర్చింది. కుక్క దాడిలో ఏడుగురికి గాయాలయ్యాయి. రోడ్డుపై వెళ్తున్న అంజిరెడ్డి, సాయిలు, గ్రామానికి విందుకు వచ్చిన ఓ మహిళ, బీహార్‌కు చెందిన ముగ్గురు హమాలీలతోపాటు మరో వ్యక్తిని గాయపర్చింది. కుక్కదాడితో భయాందోళనకు గురైన గ్రామస్తులు కర్రలతో దాని వెంటపడి కొట్టి చంపారు. గాయపడిన వారిని బాదేపల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

గోతులు తీశారు.. వదిలేశారు



నవాబుపేట: మిషన్ భగీరథ అధికారులు పనుల కోసం రోడ్డు వెంట గోతులు తీయించి పూర్తి కాగానే వాటిని మొక్కుబడిగా ముసేసినట్లు చేసి మట్టి కుప్పలు అలాగే ఉంచుతున్నారు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పటం లేదు. మండల పరిధిలోని లోకిరేవు, లింగంపల్లి గ్రామాల మధ్య పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మిషన్ భగీరథ అధికారులు కాల్వలు, గోతులు తీయించారని, తీరా పనులు పూర్తి చేసి వాటిని సగం సగం మూయించారని స్థానికులు అంటున్నారు. ఈ దారిలో ప్రయాణించాలంటే జంకుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి మూసివేయించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

యాగశాల ప్రారంభం



రాజాపూర్: మండల కేంద్రంలోని శివసీతారామాంజనేయస్వామి ఆలయ పునర్‌నిర్మాణం, విగ్రహాల ప్రతిష్ఠలో భాగంగా సోమవారం మొదటిరోజు యాగశాల ప్రారంభోత్సవం, హనుమాన్‌చాలీసా పారాయణం నిర్వహించారు. అదేవిధంగా గురువారం వరకు హోమ కార్యక్రమాలు ఉంటాయని, అదేరోజు విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొప్పెరిబచ్చిరెడ్డి, ఆలయకమిటీ చైర్మన్ కృష్ణయ్య, కార్యదర్శి అచ్చయ్య తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి రానున్నట్లు వివరించారు.

చిన్నారులను అంగన్‌వాడీకి పంపండి

మహబూబ్‌నగర్ రూరల్: ఐదేళ్లలోపు చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసీమ్ సుల్తానా అన్నారు. పట్టణంలోని రవీంద్రనగర్‌లో సోమవారం అంగన్‌వాడీ బడిబాట ర్యాలీ నిర్వహించి చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం చిన్నారుల తల్లులకు బాలామృతం, గుడ్లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

దేవరకద్ర: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కౌకుంట్ల కార్యాలయంలో ఇఫ్టూ, సీఐటీయూ, ఇతర సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వినతిపత్రం ఇచ్చారు. ఇఫ్టూ జిల్లా నాయకుడు సాంబశివుడు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది అంజయ్య, వెంకటేశ్, చెన్నమ్మ, లక్ష్మి, తిరుపతి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పత్తి సాగుపై అప్రమత్తత అవసరం

నవాబుపేట: వర్షకాలంలో పత్తి సాగుచేసే రైతులు జాగ్రత్తగా నడుచుకోవాలని, విత్తనాలు కొనేముందు అన్ని రకాలుగా అప్రమత్తంగా వ్యవహరించాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణకిషోర్ తెలిపారు. విత్తనాల కొనుగోలుపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాలు కొన్నప్పుడు రసీదు తీసుకోవాలని, అందులో కంపెని పేరు, విత్తనం రకం, బ్యాచ్ నంబర్, లాట్‌నంబర్ విధిగా రాయించుకోవాలన్నారు. రసీదులను జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. విత్తనం ప్యాకెట్‌పై ఎక్స్‌పైరీ డేట్ వంటివి సరిచూసుకోవాలన్నారు. ప్రభుత్వం ధ్రువపరిచిన జీఈఏసీ నంబర్ ఉందా లేదా చూసుకోవాలన్నారు. లూస్ ప్యాకెట్ల విత్తనాలు కొనరాదన్నారు. గ్రామాల్లో ఎవరైనా విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. అదేవిధంగా వేరే రాష్ట్రం నుంచి తీసుకువచ్చిన వాటిని కొనరాదన్నారు. ఎమైనా సందేహాలు ఉంటే ఏఈఓలను సంప్రదించాలని ఆయన వివరించారు.

నేడు వైఎస్సార్‌టీపీ జిల్లా కార్యాలయం ప్రారంభం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం ఎదుట వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు మందడి సరోజ్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ఉంటుందని, అదే విధంగా జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో త్వరలో కార్యాలయాలను ప్రారంభిస్తామని వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

రాజాపూర్: ఓ యువతి అదృశ్యమైన ఘటన మండలపరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ముదిరెడ్డిపల్లికి చెందిన ఓ యువతి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో చదువుతోంది. సెలవులు ఉండటంతో ఇంటివద్దనే ఉంటోంది. ఈ క్రమంలోనే ఈ నెల 3 నుంచి కనిపించకుండా పోయింది. చుట్టు పక్కల గ్రామాల్లోని బంధువుల ఇళ్లలో వెతికినా కనిపించకపోవడంతో ఆమె తల్లి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. కాగా మిస్సింగ్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవాబుపేట: ఆస్పత్రిలో చికిత్సపొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని యన్మన్‌గండ్లలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తంగళ్ళకుచ్చ బుచ్చయ్య(63) ఆదివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహ్యతకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉండగా బంధువులు 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. కాగా మద్యం మత్తులో పురుగుల మందు తాగినట్లు కుటుంబసభ్యులు వివరించారు. ఘటనపై బుచ్చయ్య కుమారుడు నరేష్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.